క్లుప్తంగా

రామాలయ పునఃప్రతిష్టకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఆహ్వానం



కైకలూరు: రామాలయ పునఃప్రతిష్ట కార్యక్రమానికి స్థానిక ఏలూరు రోడ్ వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణకు వేమవరప్పాడు గ్రామస్తులు ఆహ్వానపత్రాన్ని మంగళవారం అందించారు. ఈ నెల 12న జరిగే ప్రతిష్ట కార్యక్రమానికి ఇద్దరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తలారి వెంకటస్వామి, పొండ్రి రాము, బోయిన గోవిందరాజులు, తలారి శ్రీహరిబాబు, బోడావుల శ్రీవెంకటేశ్వరరావు, బోడావుల వసంతరావు పాల్గొన్నారు.

ప్రదీప్‌కు పాస్టర్ల సత్కారం



ముదినేపల్లి రూరల్: వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు వెంట్రప్రగడ ప్రదీప్‌ను మండలంలోని పలువురు పాస్టర్లు మంగళవారం సత్కరించారు. మండలంలోని పెదపాలపర్రుకు చెందిన ప్రదీప్‌ను క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు పెదపాలపర్రులోని ప్రదీప్ నివాసంలో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించి హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య సహకారంతో తనకు ఈ పదవి దక్కినట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావుతో పాటు పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరిస్తా..

ఇదిలా ఉండగా పలువురు పాస్టర్లు ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణను కార్యాలయంలో కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు.

దీవించమ్మా.. గంగానమ్మా



కోడూరు: భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న కోడూరు గంగాభవానీ అమ్మవారి ప్రధాన గుడిసంబరం మంగళవారం ప్రారంభమైయింది. ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. తొలిరోజు అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్దారు. కోడూరు, ఐబీపేట, యర్రారెడ్డివారిపాలెం, కృష్ణాపురం, నాయుడుపేట గ్రామాలకు చెందిన రైతులు తమ పశువులను ఆలయం చుట్టూ తిప్పి, పశుసంపదను కాపాడాలంటూ అమ్మవారికి మొక్కులు సమర్పించారు. ఆలయంలో పోతురాజు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. చిన్నఅమ్మవారి గ్రామోత్సవం ప్రస్తుతం కృష్ణాపురం, ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామాల్లో కొనసాగుతోంది. ప్రతి ఇంటి వద్ద మహిళలు అమ్మవారి వాహనం ముందు నీటిని ఓరబోసి భక్తిభావం చాటుతున్నారు. బుధవారం అమ్మవారిని త్రిశులధారిణిగా అలంకరించి భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ధర్మకర్త యుగంధరరావు తెలిపారు. ఉదయం అమ్మవారి నైవేద్యాల సమర్పణ, రాత్రి ప్రధాన గుడిజాతర నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రధానార్చకుడు కోమ్మూరి శ్రీనివాసశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అత్తింటివారిపై వరకట్నం వేధింపు కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి ప్రభునగర్‌కు చెందిన గున్నుపాముల కావ్య గత ఏడాది సత్యకృష్ణను పెద్దల సమక్షంలో కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. భర్త హైదరాబాద్ జీడిమెట్లలో ప్రైవేటు ఉద్యోగం చేస్తాడు. అయితే కొద్ది నెలలుగా సత్యకృష్ణ అదనపు కట్నం కావాలంటూ భార్యను వేధించసాగాడు. భర్తతో పాటు అత్త రత్నకుమారి, ఆడపడుచులు వెంకటలక్ష్మి, కామాక్షి కూడా వేధించటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు అత్తింటివారికి కౌన్సెలింగ్ చేసినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆరోగ్యకర జీవితానికి నడక మంచి ఔషధం

గన్నవరం: ఆరోగ్యవంతమైన జీవనం కోసం ప్రతిఒక్కరూ వాకింగ్ చేయాలని వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ జిల్లా గవర్నర్ చిన్నం రామకృష్ణ సూచించారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం వాకర్స్ అసోసియేషన్ ఆఫ్ గన్నవరం శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నూతన అధ్యక్షులు కేవీఆర్ కిషోర్, కార్యదర్శి ఎల్.సురేంద్ర, కోశాధికారి బి. కోటేశ్వరరావుతో జిల్లా గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ ఎండీ గౌసాని, గ్రామ సర్పంచి నిడమర్తి సౌజన్య, హెచ్ఎం ఎన్.రవీంద్రభవాని, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సుఖసంతోషాలు వెల్లివిరియాలి

శ్రీ క్రోధి నామ సంవత్సరంలో సుఖసంతోషాలతో వెల్లివిరియాలని జిల్లా ప్రజలు కోరుకున్నారు. గుడివాడ, పామర్రు, కైకలూరు నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాల్లో ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయా మండల కేంద్రాల్లో ఆలయాలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ ఏడాది అంతా మంచి జరిగేలే ఆశీర్వదించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుడివాడ టౌన్: శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ హోమ్‌లోని పీవీ నరసింహరావు కల్యాణ మండపంలో భారతి సమితి గుడివాడ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. భారతీ సమితీ అధ్యక్ష కార్యదర్శులు డీఆర్‌బీ ప్రసాద్, మోకా మాధవరావు నేతృత్వంలో కవిసమ్మేళనం జరిగింది. ఉపాధ్యాయుడు జి. శ్రీనివాసరావు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ప్రముఖ కవయిత్రి వై. అనురాధ, సభ్యులు ఎంవీజే ఆంజనేయులు, డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్, కేఎస్ అప్పారావు, ఎం. రమ్యారెడ్డి, వి. రాఘవాచారి, జి. చిరంజీవులు, మాటూరి రంగనాథ్, తాడిపత్రి సునీత, వసుధ బసవేశ్వరరావు, ప్రసాదు పాల్గొన్నారు. అనంతరం భారతీ సమితీ అధ్యక్ష కార్యదర్శులను సత్కరించారు.

ఏపీఎంపీఏ ఆధ్వర్యంలో..

ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సీనియర్ జర్నలిస్టులను సత్కరించారు. స్థానిక కృష్ణజ్యోతి సాయంకాల పత్రిక కార్యాలయంలో డీఆర్‌బీ ప్రసాదు, శ్యామ్‌బాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంపీఏ రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్, కోశాధికారి ఎం.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలో ఉగాదిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నిద్రలేచి స్నానాదులు ముగించుకుని నూతన వస్త్రాలు ధరించి పూజలు జరిపారు. ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. ఏడాది పొడవునా సుఖశాంతులతో వర్ధిల్లే విధంగా దీవించాలని తమ ఇష్ట దైవాలను వేడుకున్నారు.



రాపర్లలోని వీరాంజనేయస్వామి ఆలయంలో భక్తులు

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: ఉగాది వేడుకలను మంగళవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తోట్లవల్లూరులోని శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి ఆలయం, శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయాల్లో పంచాంగ శ్రవణం జరిగింది. ఆయా ఆలయాల్లో అమరవోలు హరికృష్ణ పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ ఈఓ హరి దుర్గా నాగేశ్వరరావు, గుమ్మస్తా శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

ఆలయాలు కిటకిట

పామర్రు: క్రోధి నామ సంవత్సరం ప్రారంభం పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు మంగళవారం విశేషంగా పూజాధికాలను నిర్వహించారు. ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు చేశారు. రాపర్ల వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామికి విశేషంగా పంచామృతాలతో అభిషేకాలను చేశారు.

కొండలమ్మ సన్నిధిలో పంచాంగ శ్రవణం

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి ఆలయ సన్నిధిలో ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం బ్రహ్మశ్రీ జె.పి.వి.ఎస్.శర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు. తొలుత అమ్మవారికి విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలను చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కానూరి సురేష్, చైర్మన్ శేషం గోపి పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: స్థానిక విష్ణాలయంలో పద్మశ్రీ ఘంటసాల కళాపీఠం వారి ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా మంగళవారం అర్చకులు రొంపిచర్ల సత్యనరసింహ ప్రసాద్ పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం ఘంటసాల కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ ఆధ్వర్యంలో బ్రాహ్మణులకు సత్కారం నిర్వహించారు. ఆర్ ప్రసాద్, వీ ఠాగూర్, బి పద్మాకర్, ఆర్ గోపి, శర్మను శాలువాలతో నిత్యావసర వస్తువులను అందజేసి సత్కరించారు. అనంతరం ఆలయ మేనేజర్ కె వెంకట్రరెడ్డి, ఘంటసాల కళాపీఠం అధ్యక్షుడు మురళీ కృష్ణను సత్కరించి బ్రాహ్మణులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో విజన్‌లైఫ్ సెంటర్ అధినేత సాల్మన్ కొల్లాబత్తుల, హితమ్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్ హేమంత్ రెడ్డి పాల్గొన్నారు.



గుడివాడలో డీఆర్‌బీ ప్రసాదు, మాధవరావుకు సత్కారం

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో వాసవీ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం, అనంతరం బ్రాహ్మణులకు పంచాంగాలను బహూకరించారు. క్లబ్ అధ్యక్షుడు ఘంటసాల త్రివిక్రమ సాయిరాం, వనితాక్లబ్ అధ్యక్షురాలు ఘంటసాల నాగ వెంకట హరి సునీత పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో శ్రీక్రోధి నామసంవత్సర పంచాంగ శ్రవణాన్ని జరిపారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండి రైతులు క్షేమంగా ఉంటారని శ్రవణ నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రముఖ వేదపండితుడు చావల సూర్యనారాయణమూర్తి సత్కరించి, దేవదాయశాఖ తరఫున పారితోషికంగా రూ.10,116 చెక్కును సహాయ కమిషనర్ నేల సంధ్య అందజేశారు. వేసవి కారణంగా ఆలయానికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సహాయ కమిషనర్ ప్రారంభించారు.



సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో చలివేంద్రంలో తాగునీటిని అందిస్తున్న కమిషనర్

కైకలూరులో..

కైకలూరు: ఉగాది వేడుక కైకలూరు సాహితీమిత్రుల ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో మంగళవారం జరిగింది. దివంగత చెరుకువాడ శివరామరాజు వేదిక పేరుతో సాహితీ మిత్రుల అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మలపల్లి బాలకృష్ణారావు, చింతపల్లి వెంకటనారాయణ ఉగాది వేడుకను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ధ్యానరత్న డాక్టర్ ఉండ్రమట్ల సాంబశివరావు హాజరయ్యారు. విద్యాన్ నవులూరు రమేష్‌బాబు రచించిన కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారి చరిత్ర గ్రంథావిష్కరణను ఉండ్రమట్ల సాంబశివరావు చేశారు. అనంతరం ఉగాది పురస్కారాలను ఉండ్రమట్ల సాంబశివరావు, విద్యాన్ నవులూరి రమేష్‌బాబు, ద్వారపురెడ్డి జయరాంనాయుడుకు సాహితీ మిత్రులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. సాహితీవేత్తలు వంశీ, పార్వతీశ్వర్, రత్నారావు, బలే చంటి, ప్రసాద్, భాస్కర్, జయప్రకాష్ పాల్గొన్నారు.

పంచాంగ శ్రవణం

కైకలూరు: శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని కైకలూరు శ్యామలాంబ దేవాలయంలో నోరి సుబ్రహ్మణ్యశాస్త్రీ పంచాంగ శ్రవణం చేశారు. పలు అంశాలపై భక్తులకు వివరించారు. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గుడ్లవల్లేరులో పంచాంగ శ్రవణం చేస్తున్న శర్మ



పామర్రులో బ్రాహ్మణులను సత్కరిస్తున్న మురళీకృష్ణ తదితరులు



కైకలూరు గ్రంథాలయంలో పెద్దింట్లమ్మ చరిత్ర గ్రంథావిష్కరణ

కొడాలి నానికి పెరుగుతున్న జనాదరణ

గుడివాడ టౌన్: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఎన్నికల ప్రచారంలో ప్రజల మద్దతు రోజురోజుకు పెరుగుతోంది. పట్టణంలోని 31, 32 వార్డుల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక 32వ వార్డులోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కొడాలి నాని ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. ఆలయ అర్చకుడు వేదాంతం అప్పలాచార్యులు కొడాలి నానికి వేంకటేశ్వరస్వామి ఫొటో బహూకరించి విజయం చేకూరాలని ఆశీర్వదించారు. అనంతరం ఆయన గడప గడపకు తిరుగుతూ అభివాదం చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేసి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. 20 సంవత్సరాలు ఎమ్మెల్యేగా గుడివాడ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన కొడాలి నానితో ఏదో ఒక రూపంలో పరిచయం ఉన్న అభిమానులు ఆయనకు ఘనస్వాగతం పలుకుతున్నారు. ఇళ్లల్లోకి ఆహ్వానించి ఫొటోలు దిగుతున్నారు. మహిళలు తమకు జరిగిన మంచిని కొడాలి నానికి వివరించి హారతులు పడుతున్నారు. ఆయనతో కలిసి ఎన్నికల ప్రచారంలో ముందుకు వస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు తమ మద్దతు అంటూ మహిళలు ప్రచారంలో చెబుతున్నారు. ప్రచారంలో భాగంగా స్థానిక పాటిమీద గల కరుణాపీఠం వృద్ధాశ్రమం వద్దకు వెళ్లి వృద్ధులను పరామర్శించారు. పలువురు వృద్ధులు తమకు పింఛన్ పంపిణీకి వలంటీర్లు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావాలని కోరుతున్నామని ఓ వృద్ధురాలు కొడాలి నానికి చెబుతూ హారతి ఇచ్చి దీవించారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన మిత్రుని ఇంటికి వెళ్లి పరామర్శించి తాను, తన ప్రభుత్వం ఆరోగ్యం విషయంలో అండగా ఉంటామని హామీ ఇచ్చి, అతనికి ఊరట కలిగించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, పార్టీ అన్ని విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, మహిళా కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కొడాలి నానిని ఆశీర్వదిస్తున్న అర్చకులు



కొడాలి నానికి హారతులు పడుతున్న మహిళలు

‘సంజీవని’లో ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభం

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని-సాయి ఆరోగ్య మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో మంగళవారం ఉగాది పర్వదినం నాడు ఆరోగ్య శ్రీ సేవలను ప్రారంభించారు. ఇకపై హాస్పిటల్‌లో స్త్రీ, ప్రసూతి సేవల, చిన్నపిల్లల సేవలు, ఎముకలు, కీళ్ల సమస్యలు, పాలీట్రామా సేవలు, జనరల్ మెడిసిన్ సేవలు, జనరల్ సర్జరీలు, చెవి, ముక్కు, గొంతు సేవలను ఆరోగ్య శ్రీ ద్వారా అందించనున్నట్లు హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ హనుమకుమార్ తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ డైరెక్టర్ సూర్యప్రభ, డాక్టర్లు పరశురామ్, సుబ్బారావు, హారిక, ఆరోగ్య మిత్ర అనిత, హాస్పిటల్ సలహా కమిటీ కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వరరావు, సభ్యులు బోస్, రమేష్, మురళీ పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు

హాస్పిటల్‌లో గైనకాలజీ, పీడియాట్రిషన్, ఇంటర్నల్ మెడిసిన్, అనస్థీషియా డాక్టర్లతో పాటు ఓటీ, సీఎస్ఎస్‌డీ, అనస్థీషియా టెక్నీషియన్లు, ఐసీయూ విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, అర్హత గల వారు హాస్పిటల్‌ను సంప్రదించాల్సిందిగా నిర్వాహకులు కోరారు.



ఆరోగ్యశ్రీ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్

స్వర్ణోత్సవ సంగీత సభలు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: శ్రీ త్యాగరాజ సంగీత విద్యాపీఠం స్వర్ణోత్సవ సంగీత సభలు మంగళవారం ప్రారంభమయ్యాయి. స్థానిక బుట్టాయిపేటలోని చిట్టిపిల్లారయ్య స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ సభలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. మంగళవారం సాయంత్రం జరిగిన సంగీతసభలో విద్యాపీఠం అధ్యక్షుడు బీహెచ్ఈఎల్ రాధాకృష్ణమూర్తి స్వాగతోపన్యాసం చేశారు. వాగ్గేయకార సంకీర్తన - బృందగానం లో లింగరాజు విజయలక్ష్మి, సింగరాజు కల్యాణి, కాళీపట్నపు ఉమా ఆలపించిన గానాలు శ్రోతలను ఆకట్టుకున్నాయి. అలాగే గూడూరు ద్రోణేంద్ర ఫణికుమార్ వేణుగానం శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది. వయోలిన్‌పై పెరవలి నందకుమార్, మృదంగంపై బీరక సురేష్, మోర్సింగ్ పై టి. లక్ష్మీశంకర్ వాయిద్య సహకారం అందించారు. బుధ, గురువారాల్లో కూడా సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తామని సంగీత ప్రియులు కార్యక్రమానికి విచ్చేయాలని విద్యాపీఠం సహాయ కార్యదర్శి జొన్నలగడ్డ లక్ష్మీకాంత్ కోరారు.

వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలి

మండవల్లి: అవినీతికి తావు లేని పాలన అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండవల్లిలోని 3, 4 వార్డులలో రెండో రోజు మంగళవారం గుడ్‌మార్నింగ్ కార్యక్రమం జరిగింది. పెద్దఎత్తున ప్రజలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. వారికి చేసిన సేవలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ మెండా ఝాన్సీ, సురేష్, వైస్ ఎంపీపీ అగస్టీ ఆదివిష్ణు, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు బి.యేసోబురాజు, కలిదిండి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు తిరుమాని రమేష్, నాయకులు, ముంగర మల్లికార్జునరావు, బొమ్మన బోయిన గోకర్ణ, పెరుమాళ్ల సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు గుడివాడ సత్యప్రసాద్ (బాబీ), ఆలయ చైర్మన్ కొల్లా కృష్ణ, జిల్లా వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు పాల్గొన్నారు.



మండవల్లిలో గుడ్‌మార్నింగ్ కార్యక్రమంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కూటమి నేతలు మోసగాళ్లు

ముదినేపల్లి రూరల్: ఓట్ల కోసం వచ్చే నియోజకవర్గంలోని ఎన్డీయే కూటమి నేతలంతా మోసగాళ్లు అని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోడలు దూలం స్వాతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ విమర్శించారు. మండలంలోని శ్రీహరిపురంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ తరఫున ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం నిర్వహించారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, పార్టీ నాయకులు మోట్రు ఏసుబాబు, కోమటి విష్ణువర్ధన్, పేర్ని పృథ్వీ పాల్గొన్నారు.



శ్రీహరిపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్ కోడలు దూలం స్వాతి

డీఎన్నార్, కారుమూరిని బలపరచాలి

మండవల్లి: సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థి దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌కు ప్రజలు ఆశీస్సులు అందజేయాలని ఎమ్మెల్యే డీఎన్నార్ పెద్ద కోడలు దూలం శ్రీ అనుపమ కోరారు. మండలంలోని తక్కెళ్లపాడులో మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



తక్కెళ్లపాడులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్ పెద్దకోడలు శ్రీఅనుపమ

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

ఉంగుటూరు: షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన సంఘటన వెన్నూతల గ్రామంలో మంగళవారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం తోట మాధవరావు తన కుటుంబ సభ్యులతో కలసి ఇంటిలో ఉండగా మధ్యాహ్నం రెండు గంటల సమయంలో సర్వీస్ వైర్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. దీంతో ఇంట్లో వారంతా బయటకు పరుగులు తీశారు. ఫైర్ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని మంటలను నివారించారు. పూరిల్లు పూర్తిగా దగ్ధం కాగా బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. రూ.5 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోతున్నారు. గ్రామ సర్పంచ్ టీవీ రామ్మోహన్‌రావు బాధితులను పరామర్శించారు.

36 మద్యం బాటిళ్ల స్వాధీనం

తోట్లవల్లూరు: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని యాకమూరులో జరిగింది. గ్రామానికి చెందిన కంఠమనేని బాలాజీ అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తుండగా మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ పి. విశ్వనాథ్ తెలిపారు. అతడి వద్ద నుంచి 36 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రేపు శ్యామశాస్త్రి జయంతి ఉత్సవాలు

గుడివాడ టౌన్: సంగీత విద్వాంసులు శ్యామశాస్త్రి జయంతి వేడుకలు గురువారం నిర్వహించనున్నట్లు శ్రీ త్యాగ బ్రహ్మ వైభవ ప్రకాశ సభ నిర్వాహకులు కావూరి శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సత్యనారాయణపురంలోని ఉపద్రష్ట వెంకటశాస్త్రి బ్రాహ్మణసత్రంలో సాయంత్రం ఆరు గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ప్రముఖ ప్రఖ్యాత హరికథకులు ముప్పవరపు వెంకట సింహాచల శాస్త్రిచే శ్రీ కామాక్షి వైభవం హరికథ ఉంటుందని తెలిపారు. సంగీత ప్రియులు ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పమిడిముక్కల: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. అగినపర్రు, మామిళ్లపల్లి, బొడ్డువానిగూడెం, పోతురాజుమాలపల్లి, దేశన్నపాలెం, తెల్లాకులపాలెం, మగ్గాల మాలపల్లి, జువ్వలపాలెం, హనుమంతపురం, ముళ్లపూడి, వేల్పూరు, ఐనంపూడి ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు కార్యకర్తల సమావేశం

మొవ్వ: మొవ్వ మండలం కూచిపూడిలోని ఎస్‌బీఐ సమీపంలోని ఎస్ఎస్ఎల్ కన్వెన్షన్ హాల్లో మొవ్వ మండల బూత్ కమిటీలు, కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు మంగళవారం తెలిపారు. సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ సమావేశానికి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంటరీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్ హాజరవుతారని పేర్కొన్నారు.

వృద్ధులకు అన్నసమారాధన

పామర్రు: స్థానిక వాసవీ వృద్ధ శరణాలయంలోని వృద్ధులకు దాతల సౌజన్యంతో మంగళవారం అన్నదానం చేశారు. స్థానికులు జంగా సాయి అక్షితారెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె తల్లిదండ్రులు గోపాల్‌రెడ్డి, వేదశ్రీ కుటుంబసభ్యులు వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సుదర్శన రెడ్డి, ఘంటసాల భరతుడు పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

పమిడిముక్కల: కూడేరు గ్రామం సమీపంలోని పొలాల్లో జరుగుతున్న కోడిపందేల శిబిరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,510, ఒక కోడిని, కత్తిని స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు పంపనున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: కోడి పందేలు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను ఆత్కూరు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పొట్టిపాడు గ్రామ శివారులో పామాయిల్ తోటలో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ పైడిబాబు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు స్వాధీనపరచుకున్నారు. అనంతరం వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

బెల్టుషాపు నిర్వాహకుడు అరెస్టు

కంకిపాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టుషాపు నిర్వాహకుడిని కంకిపాడు పోలీసులు సోమవారం అర్ధరాత్రి అరెస్టు చేశారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన వివరాల మేరకు...కోలవెన్ను గ్రామంలో దుర్గారావు అనే వ్యక్తి బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందటంతో నిఘా వేసి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 11 మద్యం సీసాలు లభ్యమయ్యాయి. మద్యం సీసాలను సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదనపు ఎస్ఐ తాతాచార్యులు నేతృత్వంలో దాడులు జరిగాయని ఎస్ఐ సందీప్ తెలియజేశారు.